సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 2, అక్టోబర్, 2024



సోమశిలలో 53.467 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 53.467 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైనుంచి 6,200 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. 96.292 మీటర్ల మట్టం నమోదయింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.77,780
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,065
3శాతం జీఎస్టీతో	రూ.7,277
సవర (8గ్రా)	రూ.58,216

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /26.8

వాతావరణం

జిల్లాలో గాలిలో తేమ 71 శాతంగా మంగళవారం నమోదైంది. బుధవారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కనీస మద్దతు ధరకు ధాన్యం అమ్మకాలు: జేసీ

నెల్లూరు(దర్గామిట్ట): రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టాలని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయీస్ మేనేజర్ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ 37,978 ఎకరాల్లో వరికోతలు సాగుతున్నాయని, 1,29,583 టన్నుల ధాన్యం ఉత్పత్తి కావచ్చని అన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ధర నిర్ణయించినట్లు వివరించారు.

జిల్లాలో 4 కేంద్రాల్లో టెట్ పరీక్షలు



సూచనలు ఇస్తున్న డీఆర్‌ఓ లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఏపీ టెట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఆర్‌ఓ లవన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో టెట్ పరీక్షల నిర్వహణపై సమన్వయ అధికారులతో డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 4 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 9,395 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు లైట్లు, మరుగుదొడ్ల వసతులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. నెల్లూరు నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, పొట్టేపాళెం సమీపంలో గల అయాన్ డిజిటల్ జోన్, కావలిలోని విశ్వోదయ కళాశాల, కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డీఈఓ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

4న వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఈనెల 4వ తేదీన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయ భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని తెలియజేశారు.

➡ నెల్లూరు మూలాపేట ప్రాంతానికి చెందిన 33 ఏళ్ల జోవియాన్ (పేరు మార్చాం)కు భార్య, ఒక సంవత్సరం వయసున్న చిన్నబిడ్డ ఉన్నారు. ఆయనకు తరచుగా తలనొప్పి రాసాగింది. పలు ఆస్పత్రులు తిరిగాడు. డాక్టర్లు మందులు రాసిస్తున్నారు. నొప్పి తగ్గుతోంది. మళ్లీ వస్తోంది. చివరికి నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కాన్ చేయగా మెదడు భాగంలో కణితి ఉన్నట్టు తేలింది. పరీక్ష చేయగా కేన్సర్ అని తేలింది. నరాలతో ఆ కణితికి లింక్ ఉండటంతో ఇక్కడ డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటే భయపడ్డారు. దీంతో బెంగళూరులోని నిమ్‌హాన్స్ ఆస్పత్రిలో నెల క్రితం ఆపరేషన్ చేయించారు. కాలు, చేయి పడిపోయింది. ప్రస్తుతం పొదలకూరు రోడ్డులోని కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతున్నారు.

➡ నెల్లూరు శివారు ప్రాంతంలోని భగత్‌సింగ్ కాలనీలో భార్యాభర్తలలో ముందుగా భర్తకు కేన్సర్ సోకింది. తొలి దశలో కనుక్కోలేక పోవడంతో 6 నెలల్లో అతను మరణించాడు. భార్యకు సంవత్సరం తిరగకుండానే సర్వైకల్ కేన్సర్ సోకింది. ఆమె చికిత్స తీసుకున్నందు వల్ల ప్రస్తుతానికి కోలుకుంది. ఒంటరిదయింది.

➡ ఆత్మకూరు మండలం నల్లపరెడ్డిపల్లె గ్రామంలో ఓ మహిళకు కడుపులో కేన్సర్ గడ్డ ఉండగా హైదరాబాద్‌లో రెండేళ్ల క్రితం ఆపరేషన్ చేశారు. చేసిన నెలలోపు మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగి నెల్లూరులో కాపురం ఉంటున్నాడు. ఆయనకు ఇలాగే కేన్సర్ రాగా అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. చివరికి తుదిశ్వాస విడిచాడు. ఇప్పుడు అదే గ్రామం పడమటి వీధికి చెందిన మరో మహిళ బ్రెస్ట్ కేన్సర్‌తో హైదరాబాద్ బసవతారకం ఆస్పత్రిలో ట్రీట్ మెంట్ తీసుకుంటోంది.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇప్పుడు నగరం, గ్రామీణం, ఆవీధి.. ఈవీధి అనే తేడా లేకుండా కేన్సర్ మహమ్మారి మనుషులను కబళించేస్తోంది.

సమాజంపై కేన్సర్ పడగ

ప్రాణాలు పోతున్నాయ్
- ఛిద్రమవుతున్న జీవితాలు
- పసిబిడ్డల నుంచి పండు ముదుసలి వరకు బాధితులే
- జిల్లాలో 20వేల మందికి పైగా రోగులు
- ఏడాదికి 250 మంది వరకు మరణాలు

కేన్సర్ అంటేనే ప్రతి ఒక్కరి శరీరంలో వణుకు. భూమి కంపించినట్టు అవుతుంది. ఇంకేముంది జీవితం ముగిసినట్టు భావిస్తున్నారు. అలాంటి కేన్సర్ 25 ఏళ్ల క్రితం ఎక్కడో.. ఎవరికో ఒక్కరికి వచ్చేది. దాని గురించి పట్టించుకునే వారు కరువే. ఇప్పుడు కాలంతోపాటు మన జీవన విధానాలు మారాయి. ఆహారపు అలవాట్లు, కల్తీ తిండి, ఒత్తిడి, పొగాకు ఉత్పత్తుల వినియోగం తదితర కారణాల వల్ల కేన్సర్ మహమ్మారి పచ్చని సమాజంపై పడగ విప్పింది. దీంతో నిండు నూరేళ్లు బతకాల్సిన వారు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు.

నెల్లూరు (అర్బన్): చిన్న బిడ్డల నుంచి వృద్ధుల వరకు నేడు కేన్సర్ బాధితులే. ప్రతి సంవత్సరం రోగులు సైతం పెరిగిపోతున్నారు. రొమ్ము, గర్భాశయ, నోటి, ఊపిరితిత్తులు, కాలేయం, పాంక్రియాస్, కోలాన్, బోన్ తదితర కేన్సర్‌లతో మరణాలు సైతం ఎక్కువవుతున్నాయి. ప్రభుత్వం అక్టోబర్ నెలను బ్రెస్ట్ కేన్సర్ మాసంగా ప్రకటించి అవగాహన కల్పిస్తోంది.

జిల్లా జనాభా 29.63 లక్షలు. అందులో ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రి, మెడికవర్, పెద్దాస్పత్రి, పీహెచ్‌సీలలో స్క్రీనింగ్ జరిగినప్పుడు చూస్తే సుమారు 25 వేల కేన్సర్ కేసులు బయటపడ్డాయి. ఇందులో కొన్ని రిపీట్ కేసులను తీసి వేసినా కనీసం 20వేల మందికి పైగా కేన్సర్ బాధితులు జిల్లాలో ఉన్నారు.

ప్రస్తుతానికి కేన్సర్‌తో జిల్లాలో ప్రతి సంవత్సరం 250 మంది వరకు మరణిస్తున్నారనేది ఐఎంఏ డాక్టర్లు అంచనా వేశారు. ఈ సంఖ్య వేగంగా పెరుగుతోందని తెలుపుతున్నారు. కేన్సర్‌తో మరణాలు జరగకూడదంటే తొలి దశలోనే చికిత్సలు పొందాలని కోరుతున్నారు.

ప్రతి 9 మందిలో ఒకరికి

2050 నాటికి భారతదేశంలో ప్రతి 9 మందిలో ఒకరికి కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అందువల్ల మనిషి ఇప్పటి నుంచే మారాలని, తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ప్రధానంగా రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి కేన్సర్‌లు ఎక్కువగా వస్తున్నాయని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఇలా...

నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో కేన్సర్ వైద్యసేవలు ప్రారంభించి రెండేళ్లు కావస్తోంది. అయితే పూర్తిస్థాయిలో అందుబాటులోకి సేవలు రాలేదు. కేన్సర్ సర్జరీలు, కీమోలు మాత్రమే చేస్తున్నారు. ఇందులో గత సంవత్సరం రోజుకు 10 నుంచి 12 ఉండేది. గత సంవత్సరం మొత్తం మీద 3500 మంది వరకు ఓపీ సేవలు పొందారు. 2024 సంవత్సరానికి వచ్చే సరికి ప్రస్తుతం సరాసరి ఓపీ 50 వరకు పెరిగింది. ఆదివారం, సెలవు దినాలు తీసేస్తే 9 నెలల కాలంలో 10వేల మంది వరకు ఓపీ వైద్యసేవలు పొందారు. అలాగే కీమో వైద్య సేవలు, సర్జరీలు నెలకు 15వరకు జరుగుతున్నాయి.

మెడికవర్ ఇన్‌స్టిట్యూట్‌లో పరిశీలిస్తే...

నెల్లూరు మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను 2021 ఏప్రిల్ నెలలో ప్రారంభించారు. ఇందులో 2023 నవంబర్ నుంచి సెప్టెంబర్ 2024 వరకు 11 నెలల కాలంలో సర్జికల్ అంకాలజీ కేసులు 675, రేడియో థెరపీ కేసులు 456, మహిళలకు సర్వైకల్ కేన్సర్ కేసులు 221లకు వైద్యం చేశారు. 4,811 మందికి కీమోథెరపీ చికిత్స అందించారు.

ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్షలు చేయగా మరో 5వేల మంది వరకు రోగులకు కేన్సర్ అని తేలింది.



ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో గత నాలుగేళ్లు పరిశీలిస్తే...

సంవత్సరం	సర్జరీలు	రేడియేషన్	కీమో కేసులు	ఓపీ	మొత్తం
2021	1114	547	4220	2886	8767
2022	866	536	6011	3506	10,919
2023	834	547	7405	3334	12,120
2024(ఆగస్టు)	615	409	5240	2427	8691

పొగాకు కాదు.. పగాకు

ఖైనీ, గుట్కా, చుట్ట, బీడీ, సిగరెట్టు లాంటి పొగాకు ఉత్పత్తులను వినియోగించడం, ధూమపానం, మద్యపానం కూడా కేన్సర్ రావడానికి కారణమవుతున్నాయి. ఇవన్నీ మానేస్తే 70 నుంచి 80 శాతం కేన్సర్లను అరికట్టవచ్చు. పొగాకులో 80 రకాల కేన్సర్ కారకాలుంటాయి. పొగాకు వల్ల నోటి, ఊపిరితిత్తుల కేన్సర్లు వస్తున్నాయి. కేవలం పొగాకు వల్లనే 22 శాతం మంది మరణిస్తున్నారు.

➡ మద్యపానం వల్ల పేగు, అన్నవాహిక, పొట్ట కేన్సర్లు వస్తున్నాయి.

➡ గర్భాశయం, పాంక్రియాటిక్ లాంటి 12 రకాల కేన్సర్లకు అధిక బరువుకు సంబంధముంది.

➡ 70 శాతం గర్భాశయ కేన్సర్లు హ్యూమన్ పాపిలోమా అనే వైరస్ ఇన్‌ఫెక్షన్ల వల్ల వస్తాయి. హెపటైటిస్ బీ, సీ వల్ల కూడా రావచ్చు.

➡ రెడ్‌మీట్ (ఎర్రని మాంసం ఇందులో పొట్టేలు, పంది, పశువులు), ప్రాసెస్డ్ చేసిన మాంసం, అధిక ఉప్పు కలిగిన పదార్థాల వల్ల కూడా కేన్సర్ రావచ్చు.

అలవాట్లు మార్చాలి

కేన్సర్ రాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు మనుషులు అలవాట్లు మార్చుకోవాలి. పొగాకు ఉత్పత్తులను దూరంగా ఉంచాలి. వాయు కాలుష్యాన్ని తగ్గించుకోవడానికి మాస్క్ వాడితే మంచిది. జంక్‌ఫుడ్స్ తినడం, మరగ కాచిన నూనెలో మళ్లీ ఆహారపదార్థాలు చేయడం ఆపాలి. 9 నుంచి 25 ఏళ్ల లోపు బాలికలు వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ కేన్సర్‌ను భవిష్యత్తులో రాకుండా అరికట్టవచ్చు. అనుకోకుండా బరువు తగ్గడం, ఆహారం తగినంత తీసుకోలేకపోవడం, నీరసం, రక్తహీనత లక్షణాలుంటే తక్షణమే వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ప్రాథమిక దశలో కేన్సర్‌ను గుర్తిస్తే చికిత్స చేయవచ్చు. కోలుకుంటారు.

కేన్సర్ రావడానికి కారణాలు

జీర్ణాశయ, ఊపిరితిత్తులు, కాలేయ, పాంక్రియాస్, గర్భాశయ, రొమ్ము, హెడ్అండ్ నెక్, బోన్, లింఫోమా, కోలాన్ ఇలా పలు రకాల కేన్సర్‌లు మనిషిని పట్టి పీడిస్తున్నాయి. ఇవి రెండు రకాలుగా వస్తాయి. ఒకటి వయస్సు మళ్లిన వారికి, రెండు జన్యుపరమైన మార్పుల వల్ల రావచ్చు. కేన్సర్లు ఎక్కువగా రావడానికి మనుషులే కారణం. వారి అలవాట్లే కీలకం. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే....

పిజ్జా, బర్గర్, నూడిల్స్ లాంటి జంక్‌ఫుడ్స్.. వీటికి వాడే నూనెను మరలా.. మరలా కాగిస్తారు. ఇలా మళ్లీ, మళ్లీ మరగ కాచిన నూనెల వల్ల ఫ్రీరాడికల్స్ ఏర్పడి మనిషికి కేన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ. శీతల పానీయాలు ఎక్కువగా తాగడం మరొక కారణం. విపరీతమైన ఒత్తిడి, సమయానుకూలంగా ఆహారం తీసుకోకపోవడం, తగినంత నిద్రపోకపోవడం కూడా కారణమే.

కేన్సర్ అంటే భయపడాలా..?

వ్యాధి రాగానే భయపడకూడదు. మొదటి దశలో గుర్తిస్తే కోలుకుంటారు. అందుకోసం 40 ఏళ్లు దాటిన వారు ప్రతి సంవత్సరం చిన్న, చిన్న స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. చికిత్స పూర్తయినా మళ్లీ తిరగబెట్టే అవకాశం కూడా ఉంటుంది. అందువల్ల వైద్యుల పర్యవేక్షణలో మధ్య మధ్యలో పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. అశాస్త్రీయ పద్ధతులైన ఆకు పసరు లాంటివి వాడకూడదు.

జిల్లాలో అందుబాటులోకి వైద్యం

కేన్సర్ వస్తే గతంలో లాగా చెన్నై, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి వైద్యం చేయించుకోకుండానే ఆధునిక వైద్యం జిల్లాలో అందుబాటులోకి వచ్చింది. రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను 20 ఏళ్ల క్రితమే ప్రారంభించారు. అక్కడ కీమో, సర్జరీలు, రేడియో థెరపీ లాంటి వైద్యం వల్ల వేలాది మంది రోగుల ప్రాణాలు నిలుస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా సేవలందుతున్నాయి.

మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రత్యేకంగా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నారు. అత్యాధునిక పెట్ స్కానింగ్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం అందుతోంది.

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో సైతం కేన్సర్ సేవలు ఇప్పుడిప్పుడే పుంజుకున్నాయి. కీమో, సర్జరీలు జరుగుతున్నాయి. త్వరలోనే రేడియో థెరపీ సేవలు అందించేందుకు ప్రభుత్వం సహకారం అందజేస్తోంది.

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి



జిల్లాలో కేన్సర్ కేసులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. వంశపారంపర్యం, సమయానుకూలత లేని ఆహారం, జంక్‌ఫుడ్స్, తీవ్రమైన ఒత్తిడి, హార్మోనల్ ఇన్‌బ్యాలెన్స్, ధూమపానం, మద్యపానం వల్ల కేసులు ఎక్కువగా వస్తున్నాయి. కాబట్టి కేన్సర్ నిరోధించాలంటే ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. 30 ఏళ్లు దాటిన వారు సంవత్సరానికి ఒక దఫానైనా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. అలా చేయించుకుంటే ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తించి తగు వైద్యం చేయవచ్చు. రోగి పూర్తిగా కోలుకుంటాడు. రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ ద్వారా అన్ని రకాల కేన్సర్‌లకు వైద్యసేవలందిస్తున్నాం.

– డాక్టర్ నాగేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్, రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్, నెల్లూరు

కేసులు పెరగడం బాధాకరం



కేన్సర్ కేసులు వయస్సుతో సంబంధం లేకుండా పెరగడం బాధాకరం. ఈ భూతాన్ని తరిమి కొట్టాలంటే ప్రజలు తమ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. ఆకలి తగ్గిపోయినా.. ఒక్కసారిగా బరువుతగ్గిపోయినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేయకూడదు. డాక్టర్లు పరీక్షలు చేస్తారు. ఒక వేళ కేన్సర్ అయితే చికిత్స చేసి కోలుకునేలా చేస్తారు. ప్రభుత్వ పెద్దాస్పత్రిలో కేన్సర్ విభాగం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. డాక్టర్లున్నారు. కీమోథెరపీ చికిత్సతో పాటు సర్జరీలు చేస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పద్మావతి, రేడియాలజీ అంకాలజిస్ట్, హెచ్‌ఓడీ, కేన్సర్ విభాగం, పెద్దాస్పత్రి

అవగాహన పెంచుకోవాలి




కేన్సర్ అనగానే భయపడకూడదు. ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయి. కేన్సర్‌లపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి. వైద్యులు చెప్పిన సూచనలు పాటిస్తూ.. కాలుష్యానికి దూరంగా ఉంటూ మంచి అలవాట్లు అలవరుచుకోవాలి. అప్పుడు సమాజంలో కేన్సర్లు తగ్గుముఖం పడుతాయి. పెట్‌స్కాన్ లాంటి ఆధునిక యంత్రాలు నెల్లూరులో మెడికవర్‌లో ఏర్పాటు చేశాం. పలురకాల కేన్సర్‌లకు ఆధునిక వైద్యం అందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ బిందురెడ్డి, హెచ్‌ఓడీ, మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్

ఇసుక.. మస్కా!

సాధారణ పౌరులకు అందని దుస్థితి
- అర్ధరాత్రి వేళ ఓపెన్ అవుతున్న పోర్టల్
- అరగంట వ్యవధిలోనే మాఫియా బుకింగ్
- యార్డుల నుంచి అనధికారికంగా ఇసుక తరలింపు
- రియల్ వెంచర్లకు రాత్రివేళ అనధికారికంగా సరఫరా
- దోపిడీ జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇసుక కుప్పలు నెల్లూరు రూరల్ పరిధిలోని వీపీఆర్ కన్వెన్షన్ వెనుక వైపు నగరానికి చెందిన ఓ రియల్టర్‌కు చెందిన వెంచర్‌లోనివి. అక్కడ భూమి చదును కోసం స్థానికంగా నిర్మాణ పనుల కోసం ఇసుక అవసరం. మార్కెట్‌లో ఇసుక దొరకడం కష్టంగా ఉంది. వారం రోజుల కొకసారి వాహనం ఇసుక దొరకడమే గగనమైంది. కానీ ఈ రియల్టర్‌కు మాత్రం ఒక్క రాత్రిలో 10 టిప్పర్లతో 6 వేల టన్నుల ఇసుకను తోలారు. డంపింగ్ యార్డుల్లో మాత్రం గత పదిరోజుల నుంచి కూడా 5 వేల టన్నుల ఇసుక మాత్రమే తోలకం ఉన్నట్లు గణాంకాలు చూపుతున్నారు. మరి రియల్ వెంచర్‌కు ఈ ఇసుక ఎక్కడ నుంచి వచ్చిందో ఆరా తీస్తే కోవూరు ఎమ్మెల్యే కోటరీలో ప్రధాన అనుచరుడు, పల్లిపాడు రీచ్ నుంచి రాత్రి వేళల్లో తరలించినట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికార గణం మాత్రం మామూళ్లతో కళ్లు మూసుకున్నారన్న ఆరోపణలున్నాయి.



గొలగమూడి ప్రాంతంలోని లేఅవుట్‌లో భారీగా డంప్ చేసిన ఇసుక

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఇసుక అవసరాల కోసం ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో ఉన్న పెన్నా నదిలో డ్రెడ్జింగ్ ద్వారా పూడిక తీసి ఇసుక తరలించే ప్రక్రియను ప్రారంభించారు. ఈనెల 21 నుంచి ఇసుక సరఫరా ప్రారంభమైంది. లబ్ధిదారులు నేరుగా లేదా సచివాలయాల నుంచి ఇసుక పొందేందుకు గనులశాఖ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించారు. వాస్తవంగా ఆన్‌లైన్ బుకింగ్‌లో మాయాజాలం చేస్తూ ఇసుక మాఫియాకు పూర్తిగా సహకరిస్తున్నారు. సామాన్యుడు సైట్ ఓపెన్ చేస్తే ఎర్రర్ వచ్చేలా చేస్తూ చుక్కలు చూపిస్తున్నారు. మాఫియాకు మాత్రం పోర్టల్ యాప్‌ను ఓపెన్ చేసి మైనింగ్ ఉద్యోగులే బుకింగ్ చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అనధికారికంగా ఇసుక రవాణా

సంగం, సూరాయపాళెం, పోతిరెడ్డిపాళెం డంపింగ్ యార్డుల నుంచి అనధికారికంగా ఇసుక రవాణా సాగిస్తున్నారు. డ్రెడ్జింగ్, ఇసుక రవాణా అంతా స్థానిక ఎమ్మెల్యేలకు చెందిన ముఖ్యులది కావడంతో సరైన లెక్కలు లేవు. నదిలో డ్రెడ్జింగ్ చేసి ఇసుక రవాణా చేసింది తక్కువగా చూపిస్తున్నారు. ఎక్కువ మోతాదులో తరలించి అనధికారికంగా అమ్ముకుంటున్నారు. గత నెల 21 నుంచి 30 వరకు దాదాపు 20 వేల టన్నులు ఇసుక అనధికారికంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇదంతా మైనింగ్ అధికారుల కనుసన్నల్లో జరుగుతోంది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు వాటాలు ముడుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

➡ ఇందుకు ఉదాహరణగా సంగం డంపింగ్ యార్డులో ప్రభుత్వం నిర్దేశించిన అనుమతికి మించి దాదాపు రెండు వేల టన్నుల ఇసుక అధికంగా తరలించినట్లు మైనింగ్ అధికారులు లెక్కలు చూపుతున్నారు. గత నెలలో 8 రోజుల వ్యవధిలో అంటే గత నెల 21 నుంచి 28 తేదీ వరకు 5,981 టన్నులు తరలించినట్లు లెక్కలు చూపుతున్నారు. వాస్తవంగా రోజువారీగా 500 టన్నులు ఇసుక మాత్రమే తరలించాలి. 8 రోజులంటే 4 వేల టన్నులు తరలించాలి. కానీ సుమారు ఆరు వేల టన్నులు తరలించారంటే అక్కడ అక్రమాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో అర్థమవుతోంది.

ఇసుక అక్రమ రవాణా..

ఇసుకను టీడీపీ నేతలు రాత్రివేళల్లో అనధికారికంగా రీచ్‌ల నుంచి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోవూరు, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఇసుక రవాణా సాగుతోంది. రీచ్‌ల వద్ద వాహనాలు వెళ్లకుండా గోతులు తీశామని అధికారులు నమ్మిస్తున్నారు. కానీ ఇసుక మాఫియాకు పెన్నాలోకి వెళ్లేందుకు ఎన్నో దారులు ఉన్నాయి. రెండు రోజుల క్రితం నెల్లూరు రూరల్ పరిధిలోని రియల్ వెంచర్‌కు 5వేల టన్నుల ఇసుక ఒక్క రాత్రిలో తరలించారంటే అక్రమార్కుల బరితెగింపు ఏ పాటితో అర్థం చేసుకోవచ్చు.

హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరిస్తూ..

అధికార పార్టీతో అంటకాగుతున్న ఇరిగేషన్ అధికారులు ఇసుకాసురులను రక్షించేందుకు తొక్కని అడ్డదారులు లేవు. స్వయంగా హైకోర్టు అర్హతలేని వారి అగ్రిమెంట్‌లు రద్దుచేయమని ఉత్తర్వులు ఇచ్చినా.. అంతకు రెండు రోజుల క్రితమే అగ్రిమెంట్‌లు చేసినట్లుగా ఇరిగేషన్ అధికారులు చిత్రీకరించారు.వారిచేతనే డ్రెడ్జింగ్, రవాణా చేయిస్తున్నారు. అధికారులు ఇంతగా బరితెగించి చేస్తున్నారంటే వారికి కోర్టు అంటే లెక్కలేని తనం కింద పరిగణించాలి.

సాధారణ పౌరులకు అందని ఇసుక

పెన్నాలో డ్రెడ్జింగ్ చేసి ఇసుక పూడిక తీసి జిల్లా అవసరాలు తీర్చుతామని ప్రభుత్వం చెబుతున్నా కానీ వాస్తవానికి లోకల్ ఎమ్మెల్యేల ధనదాహం తీర్చేందుకు మాత్రమే ఉపయోయపడుతోంది. సామాన్యులకు సవాలక్ష కారణాలు చూపి ఇసుక సరఫరా చేయటంలేదు. దీంతో నెల్లూరు నగరంలోనే దాదాపు 385 నిర్మాణాలు ఇసుక కొరత వల్ల నిలిచిపోయాయి. ఎందరో భవన కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తోంది.

మధ్యాహ్నానికే సచివాలయానికి తాళం



మధ్యాహ్నం 3 గంటలకే తాళం వేసి ఉన్న సచివాలయం

ఉలవపాడు: గత ప్రభుత్వంలో ప్రజలకు విశేష సేవలు అందించిన గ్రామ సచివాలయ వ్యవస్థకు మసి అంటుతోంది. ప్రస్తుతం సిబ్బంది నిర్లక్ష్యం, కూటమి ప్రభుత్వం సక్రమంగా పట్టించుకోకపోవడంతో సేవలన్నీ అటకెక్కుతున్నాయి. నెల్లూరు జిల్లా ఉలవపాడులో 2వ సచివాలయానికి సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకే తాళం వేసి వెళ్లిపోయారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల ముంగిట సేవలు అందించిన ఇదే సిబ్బంది ఈ ప్రభుత్వ హయాంలో పట్టించుకోవడంలేదు. ఎంపీడీఓ తనిఖీలు చేయకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ దుస్థితి దాపురించింది. ఉద్యోగులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో తహలీల్, ఫాతేహా



జపమాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: ప్రసిద్ధ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్‌రసూల్ దర్గాలో జరుగుతున్న 251వ గంధ మహోత్సవంలో భాగంగా మంగళవారం తహలీల్, ఫాతేహాను దర్గా ఈఓ షేక్ మొహమ్మద్ హుస్సేన్, సజ్జదా నక్షాబంద్ హఫీజ్‌పాషా ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హజరత్, అమ్మ జమమాల తస్బీను భక్తులు దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక కీర్తనలు, ఫకీరుల జరబు విన్యాసాలు, ఖత్మేఖురాన్ చదివింపులు చేశారు. అనంతరం సమాధులకు గంధ లేపనం చేసి సలాములు పాడారు. భక్తులకు గంధ ప్రసాదాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో దర్గా ఏఈఓ షేక్ షరీఫ్, సజ్జదా నషీన్ తనయుడు జునైద్ పాషా, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కోడూరుపాడు విద్యార్థి



ఎస్‌డీ అబ్దుల్ లతీఫ్

నెల్లూరు సిటీ: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు మండలంలోని కోడూరుపాడు జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎస్‌డీ అబ్దుల్ లతీఫ్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పద్మజ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

97.4 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ 97.4 శాతం మేర మంగళవారం సాయంత్రానికి పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. నగరంలో పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలో వృద్ధాప్య, వితంతు తదితర మొత్తం 3,09,711 పింఛన్లు ఉన్నాయన్నారు. ఇందులో 3,01,728 పింఛన్లు పంపిణీ చేయగా, మిగిలిన, 7,983 మందికి బుధవారం అందజేస్తామని తెలిపారు.

సబ్‌ట్రెజరీ రికార్డుల పరిశీలన

ఉదయగిరి: స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఖజానాధికారి గంగాద్రి రికార్డులు పరిశీలించారు. పింఛన్లు, అడ్మినిస్ట్రేషన్ జీతాల బిల్లులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే పింఛన్‌దారులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. బిల్లులు నిర్దిష్ట వ్యవధిలో క్లియర్ చేయడంతో పాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఓ సీహెచ్ మమత, సీనియర్ అకౌంటెంట్లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్, ఆడిట్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ మాటున కార్గో

- బస్సు లోపల, పైన లగేజీ రవాణా
- ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఎత్తివేత
- ఎలాంటి పన్నులు చెల్లించకుండానే ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా సరుకు రవాణా
- వస్త్రాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గూడ్స్
- ప్యాసింజర్ల కంటే లగేజీపైనే ప్రధాన దృష్టి
- బైక్‌లు, పేలుడు పదార్థాలు సైతం
- తనిఖీల జోలికి వెళ్లని రవాణా, జీఎస్టీ, పోలీసు అధికారులు

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి కార్గోకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ట్రావెల్స్ యజమానులు నెలవారీ ఇచ్చే మామూళ్లు తీసుకుంటూ కనీసం తనిఖీలు చేయడం లేదు. ప్రధానంగా ట్రావెల్స్‌లో నిషేధిత పదార్థాలతో పాటు ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు, ఫైర్ అయ్యే బైక్‌లు, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్ గూడ్స్ రవాణా చేస్తున్నాయి. బిల్లులు, ట్యాక్స్ చెల్లించని సరుకులు కూడా రవాణా చేస్తున్నాయి. హైస్పీడ్‌తో వెళ్లే ఈ ట్రావెల్స్ బస్సులు ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా డిజైన్ చేయబడ్డాయి. అయితే ప్రయాణికుల బరువు కంటే రెండింతలు కార్గో బరువును రవాణా చేస్తున్నాయి. మితిమీరిన వేగంతో వెళ్తున్న ఈ ట్రావెల్స్ బరువు కారణంగా ఎక్కడైనా ప్రమాదాలకు గురైతే ప్రయాణికుల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతోంది.









నెల్లూరు (టౌన్): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల ముసుగులో అధిక మొత్తంలో సరుకులు రవాణా చేస్తున్నారు. యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేసి గూడ్సు రవాణాపైనే ప్రధాన దృష్టి సారిస్తున్నారు. ప్రయాణికులకు సంబంధించిన లగేజీ బ్యాగులను సైతం తిరస్కరిస్తున్నారు. ఐదు, పది కేజీల కంటే ఎక్కువ బరువు ఉంటే.. అదనంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

లగేజీపైనే దృష్టంతా..

ప్రతి రోజు ఇతర ప్రాంతాల నుంచి నెల్లూరు మీదుగా 100కు పైగా ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రాకపోకులు సాగిస్తున్నాయి. నెల్లూరు నుంచి 25 బస్సులకు పైగా ఉన్నాయి. పండగలు, శని, ఆది, సెలవు దినాల్లోనే ప్రయాణికులకు డిమాండ్ ఉంటుంది. మిగిలిన రోజుల్లో ట్రావెల్స్ యాజమాన్యాల దృష్టింతా లగేజీపైనే ఉంటుంది. హైదరాబాద్ నుంచి నెల్లూరుతో పాటు ఇతర ప్రాంతాలకు కాఫీ, టీ, వస్త్రాల బేళ్లు తీసుకువస్తున్నారు. బెంగళూరు నుంచి వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్, పేపర్ రోల్స్ తదితర వాటిని రవాణా చేస్తున్నారు. చెన్నై నుంచి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్, నూనెలు, స్టీల్, పేలుడు పదార్థాలను రవాణా చేస్తున్న పరిస్థితి ఉంది. దీపావళి పండగ సమీపిస్తున్న వేళ చెన్నై, శివకాశి ప్రాంతాల నుంచి బాణసంచా సామగ్రిని ముందుగానే తరలిస్తున్నారు. ప్రధానంగా ట్రావెల్స్ బస్సుల్లో రవాణా చేసే ఎక్కువ వస్తువులు, సరుకులకు జీఎస్టీ చెల్లించడం లేదని తెలుస్తోంది. పన్ను చెల్లించకపోవడంతో తక్కువ ధరకు వస్తువులను తీసుకువచ్చి నెల్లూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. వ్యాపారులు ప్రధానంగా రవాణాకు ట్రావెల్స్ బస్సులనే ఎంచుకుంటున్నారు. ఇటీవల పాండిచ్చేరి నుంచి వస్తున్న ఓ ట్రావెల్స్ బస్సును ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేయగా భారీ మొత్తంలో మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వస్తువుల కొనుగోలుకు సంబంధించి పన్నులు చెల్లించకపోయినా, బిల్లులు లేకపోయినా ట్రావెల్స్ బస్సుల ద్వారా అయితే నేరుగా ఇంటికి చేరుతాయన్న నమ్మకం వ్యాపారుల్లో నెలకొంది. దీంతో వ్యాపారులు వారి సరుకుల రవాణాకు బస్సులను ఎంపిక చేసుకున్నారు పరిమితికి మించి బస్సు లోపల, పైన లగేజీ ఉండకూడదన్న నిబంధన ఉన్నా.. దాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. బస్సుల్లో ఎక్కువ లగేజీని తీసుకెళుతున్న సమయంలో బస్సు కంట్రోలు తప్పే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో బస్సు బయలుదేరే పాయింట్ నుంచి చివరి పాయింట్ వరకు తనిఖీలు ఉండడం లేదు. దీంతో ట్రావెల్స్ బస్సుల్లో యథేచ్ఛగా రకరకాల సరుకుల రవాణా చేస్తున్నారు.

తనిఖీలు పట్టించుకోని రవాణాశాఖ

ఇటీవల కాలంలో ట్రావెల్స్ బస్సులను రవాణాశాఖాధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు లేవు. గతంలో కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఉండేవి. ఈ చెక్‌పోస్టుల్లో జీఎస్టీ, రవాణా, మైనింగ్, సివిల్ సప్లయిస్, పోలీసు, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు ఉండేవారు. జీఎస్టీ అధికారులైతే ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసిన సందర్భం లేదు. తరచూ ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు చేస్తుండడంతో కొంత మేర బస్సుల్లో సరుకులు తీసుకురావడం తగ్గింది. తాజాగా ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండే చెక్‌పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ట్రావెల్స్ బస్సులను రవాణా, జీఎస్టీ, ఎక్సైజ్, పోలీసు శాఖాధికారులు లేకపోవడం, తనిఖీలు లేకపోవడంతో విచ్చల విడిగా అధికార, అనధికార సరుకులు, వస్తువులను రవాణా చేస్తున్నారు. బస్సు పరిమితికి మించి సరుకులు ఉన్నట్లయితే బస్సు అదుపు తప్పే ప్రమాదం ఉందని రవాణా అధికారులే హెచ్చరిస్తున్నారు. వేగంతో వెళ్తున్నప్పుడు బ్రేక్ వేస్తే బస్సు కుదుపులకు గురై అదుపు తప్పి పడిపోయే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖాధికారులు ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేసి అనధకార రవాణాపై కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై నిత్యం తనిఖీలు చేస్తున్నాం, బస్సుల్లో ప్రయాణికులకు సంబంధించిన లగేజీని మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. రెగ్యులర్‌గా బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు చేస్తాం. బస్సులకు సంబంధించి పర్మిట్, ట్యాక్స్, డ్రైవింగ్ లైసెన్స్, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి నిబంధనలు అతిక్రమించిన బస్సుల యాజమాన్యంపై కేసులు నమోదు చేస్తాం.

– బి. చందర్, డీటీసీ

రాపిడ్, ఓలా ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రవాణాశాఖ అధికారులు

నెల్లూరు (టౌన్): నగరంలో రాపిడ్, ఓలా ఆటో డ్రైవర్లకు మంగళవారం రవాణాశాఖ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న ధర కంటే గమ్యం చేరిన తర్వాత అదనంగా డబ్బులు ఇవ్వాలంటూ వేధిస్తున్న రాపిడ్, ఓలా డ్రైవర్లపై పలువురు ప్రయాణికులు రవాణా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రవాణాశాఖ డీటీసీ బి.చందర్ ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఓలా, రాపిడ్ ఆటోడ్రైవర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తొలి ఫిర్యాదు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నామని, మళ్లీ అదనంగా వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు ఫిర్యాదు చేస్తే ఆటోలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తామని, వారిపై దౌర్జన్యం చేయడం, బెదిరించడం చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ ఎండీ రఫీ, ఏఎంవీఐ పూర్ణచంద్ర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు

బిట్రగుంట: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మతం, ఆయన తండ్రి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు మంగళవారం బిట్రగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 29న బోగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వర రావు విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఈఓ, డిప్యూటీ సీఈఓలు అధికార దుర్వినియోగం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు

నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరు జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో పలువురు జెడ్పీటీసీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీరాజ్ నిబంధనలను తుంగలో తొక్కి సీఈఓ, డిప్యూటీ సీఈఓలు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సిబ్బంది బదిలీలకు సంబంధించి జెడ్పీ చైర్‌పర్సన్ నోట్ ఫైల్ లేకుండానే బదిలీ చేశారని అరుణమ్మ మండిపడ్డారు. జెడ్పీ చైర్‌పర్సన్ నోట్ ఫైల్ లేకుండా చేపట్టే బదిలీలు చెల్లవని తెలిసినా కూడా సీఈఓ, డిప్యూటీ సీఈఓ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ఎంపీడీఓల బదిలీలకు సంబంధించి నిబంధనలు పాటించిన అధికారులు, కార్యాలయ పాలనాధికారులు, జూనియర్ సహాయకుల బదిలీల ప్రక్రియ విషయంలో ఎందుకు విధివిధానాలు అవలంబించలేదని ప్రశ్నించారు. ఈ బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నిబంధనలు ధిక్కరించిన సీఈఓ, డిప్యూటీ సీఈఓలపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలన్నారు. సీఈఓ, డిప్యూటీ సీఈఓ కొత్తగా నియమితులయ్యారని, వ్యక్తిగత అవసరాలను దృష్టిలో పెట్టుకుని పదోన్నతి పొందిన వారిని కూడా బదిలీల్లో చేర్చారన్నారు. ఈ సమావేశంలో మర్రిపాడు, కొండాపురం, ఆత్మకూరు, గూడూరు, పెళ్లకూరు జెడ్పీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, వెంకట్రావు, లక్ష్మీప్రసన్న, యామిని, ప్రిస్కిల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెల మృతి



మృతి చెందిన గేదెలను పరిశీలిస్తున్న అధికారులు

మర్రిపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీప పొలాల్లో మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై నాలుగు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాడి రైతు చెన్ను పిచ్చిరెడ్డికి చెందిన గేదెలను మేత కోసం పొలానికి తోలారు. అక్కడ తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని పాడి రైతు చెన్ను పిచ్చిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని ఎస్సై శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏఈ రామచంద్రయ్య పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్ ప్రణయ్‌పై హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితులను సంతపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీసీఎస్ పోలీసుస్టేషన్ సమీపంలో ప్రణయ్‌పై గత నెల 29వ తేదీ అర్ధరాత్రి ఆకాశ్, పెంచలయ్య, సాయికుమార్, రాము హత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం నలుగురు నిందితులను ఎస్సై బాలకృష్ణ అరెస్ట్ చేశారు.

జిల్లాలో 182 మద్యం దుకాణాలు

- ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ
- 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు అనుమతి
- 11న లక్కీ డ్రా
- 12 నుంచి ప్రైవేట్ దుకాణాల్లో విక్రయాలు

నెల్లూరు (క్రైమ్): రెండేళ్ల కాల పరిమితితో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన మద్యం పాలసీ 'పాత సీసాలో కొత్త మద్యం' చందంగా ఉంది. స్వల్ప మార్పులు మినహా గత టీడీపీ హయాం విధివిధానాలే. లాటరీ ద్వారానే మద్యం షాపులకు లైసెన్సులు మంజూరు చేయాలని నిర్ణయించడంతో ఆ మేరకు ఎక్సైజ్ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. నూతన మద్యం పాలసీని సోమవారం అర్ధరాత్రి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్,ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, 11వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ తీసి మద్యం దుకాణాలను దక్కించుకున్న వారికి ప్రొవిజనల్ లైసెన్సులు మంజూరు చేస్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలు సాగించాలి. 2024–26 సంవత్సరానికి జిల్లాలో 182 షాపులకు సంబంధించి కలెక్టర్ ఓ ఆనంద్ మంగళవారం సాయంత్రం గెజిట్‌ను విడుదల చేశారు. షెడ్యూల్ వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు తన చాబర్‌లో ఏసీ పి. దయాసాగర్, ఈఎస్ ఎ. శ్రీనివాసులునాయుడు, ఐఎంఎల్ డిపో మేనేజర్ ఆయేషాబేగంతో కలిసి వెల్లడించారు.

నోటిఫికేషన్ విడుదల

జిల్లాలో 182 ప్రైవేట్ మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలైంది. నెల్లూరు నగరంలో 30, నెల్లూరు రూరల్‌లో 3, వెంకటాచలం 6, మనుబోలు 3, కావలి మున్సిపాల్టీలో 6, కావలి రూరల్‌లో 4, జలదంకి 3, బోగోలు 4, అల్లూరు నగర పంచాయతీలో 4, అల్లూరు రూరల్ 2, కోవూరు 6, కొడవలూరు 5, విడవలూరు 4, బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయతీలో 6, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ 3, దగదర్తి 2, సంగం 3, ఉదయగిరి 3, దుత్తలూరు 2, మర్రిపాడు 5, సీతారామపురం 2, వింజమూరు 3, కలిగిరి 3, వరికుంటపాడులో 2, కొండాపురం 3, ఇందుకూరుపేట 5, తోటపల్లిగూడూరు 5, ముత్తుకూరు 8, ఆత్మకూరు మున్సిపాల్టీలో 4, ఆత్మకూరు రూరల్ 2, అనుసముద్రంపేట 2, కలువాయి 2, అనంతసాగరం 3, పొదలకూరు 6, చేజర్ల 3, రాపూరు 4, సైదాపురం 4, కందుకూరు మున్సిపాల్టీలో 4, కందుకూరు రూరల్ ఒకటి, ఉలవపాడు 4, లింగసముద్రం 2, గుడ్లూరు 3, వోలేటివారిపాళెంలో 3 దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారు.



వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు

లైసెన్సు ఫీజు ఇలా...

2011 జనాభా లెక్కల ఆధారంగా నాలుగు స్లాబ్‌ల్లో లైసెన్సు ఫీజు ఖరారు చేశారు. 10 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షలు, 10,001 నుంచి 50 వేల వరకు రూ.55 లక్షలు, 50,001 నుంచి 5 లక్షల వరకు రూ.65 లక్షలు, ఐదు లక్షలుపైన జనాభా కగిన ప్రాంతాల్లో రూ.85 లక్షలు లైసెన్సు ఫీజుగా నిర్ణయించారు.

ఒకరు ఎన్ని దరఖాస్తులు చేసుకోవచ్చు

దరఖాస్తు ఫీజు రూ 2 లక్షలు విధించారు. ఇది నాన్ రీఫండబుల్. దరఖాస్తులను ఆఫ్‌లైన్/ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. గతంలో మారిదిగా కాకుండా జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సైతం దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. మంగళవారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్: దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేయొచ్చు.

హైబ్రిడ్: దరఖాస్తు చేసుకున్నవారు పేమెంట్ ఈ చలానా నంబర్ జనరేట్ చేసుకుని స్టేట్‌బ్యాంకు సంబంధిత బ్రాంచ్‌లో ఫీజు చెల్లించాలి.

ఆఫ్‌లైన్: డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జిల్లాలోని ఏ ఎక్సైజ్ స్టేషన్‌లోనైనా సమర్పించవచ్చు. ఏ జిల్లాలో అయితే మద్యం షాపులకు దరఖాస్తు చేశారో ఆ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ ఉండాలి.

రూ.115.70 కోట్ల ఆదాయం

జిల్లాలో 182 మద్యం దుకాణాలు ఏర్పాటుతో ప్రభుత్వం విధించిన లైసెన్సు ఫీజుల ప్రకారం ఏడాదికి రూ.115.70 కోట్ల ఆదాయం రానుంది. రూ. 55 లక్షల ఫీజు కేటగిరీలో 98, రూ.65 లక్షలు కేటగిరీలో 48, రూ.85 లక్షల కేటగిరీలో 36 మద్యం దుకాణాలు ఉన్నా యి. 2025–26కు సంబంధించి మరో పది శాతం అదనంగా ఆదాయం సమకూరనుంది. దరఖాస్తు ఫీజుల రూపేణా కోట్లలో ఆదాయం రానుంది.

తొలిరోజు దరఖాస్తులు నిల్

జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. తొలి రోజు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ఊపందుకోనుంది.